సాక్షి మెదక్

శనివారం । 25 । నవంబర్ । 2023



కాళేశ్వరంపై దుష్ప్రచారం..

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై బీజేపీ నేతలు విషప్రచారం చేయడం సిగ్గుచేటని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వివరాలు 8లో ▸



కాంగ్రెస్, బీజేపీలను నమ్మరు

కేసీఆర్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వివరాలు 8లో ▸



రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి

నర్సాపూర్ నియోజకవర్గంతోపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కష్టపడండి గెలుపు మనదే

ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు నాలుగు రోజులు కష్టపడండి గెలుపు మనదేనని బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి సూచించారు. శుక్రవారం కౌడిపల్లిలోని ఎమ్మెల్యే ఇంటి వద్ద మండల పార్టీ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, ఎంపీపీ రాజునాయక్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ చిన్నంరెడ్డి, తునికి ఆలయ కమిటీ చైర్మ న్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ప్రవీణ్, శివాంజనేయులు, నర్సింహారెడ్డి , వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నేడు ఓటు హక్కుపై ఉద్యోగుల సదస్సు

టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్



మాట్లాడుతున్న నరేందర్

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవన్‌లో శనివారం ఉద్యోగులకు ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్‌లో ఆయన మాట్లాడుతూ.. వందశాతం ఓటింగే లక్ష్యంగా 'కర్మచారి కల్యాణ్ మిషన్' పేరుతో ఉదయం 11 గంటలకు సదస్సు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ రాజర్షిషా, టీఎన్‌జీఓల కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ రానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఉద్యోగులందరూ పాల్గొని వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాండ్ల అనురాధ ఉన్నారు.

బీవీ ఆర్‌ఐటీలో స్టడీ ఫెయిర్



యూనివర్సిటీల డెలిగేట్లు, విద్యార్థులు

నర్సాపూర్ : నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం గ్లోబల్ ఎడ్యుకేషన్ కెరీర్ ఫోరం సహకారంతో స్టడీ అబ్రాడ్ ఫెయిర్ నిర్వహించారు. సుమారు 20 యూనివర్సిటీలకు చెందిన డెలిగేట్స్ పాల్గొని తమ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారని కళాశాల ప్రిన్సిపాల్ సంయ్ దూబె తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు అవసరమైన అవగాహన కార్యక్రమాలు చేపడుతుంటామని అన్నారు. ఆయా యూనివర్సిటీలకు చెందిన డెలిగెట్లు మాట్లాడుతూ.. విదేశాలకు వెళ్లేందుకు అవకాశాలతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కేసీఆర్‌తోనే భరోసా

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకుడు యాదగిరి



మాట్లాడుతున్న యాదగిరి

మనోహరాబాద్(తూప్రాన్): రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌తోనే ముదిరాజ్‌లకు భరోసా వచ్చిందని వారి అభివృద్ధికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని, సీఎం అన్ని వర్గాల అభివృద్ధికి పాటు పడ్డారని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి అన్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండలం దండుపల్లి వద్ద ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు దాసరి నరేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పురం మహేశ్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగభూషణం, నర్సయ్య, నాయకులు భిక్షపతి, కుమార్, బాబు, రాజు, మహేశ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.




శుక్రవారం హుస్నాబాద్ విజయభేరి సభలో మాట్లాడుతున్న ప్రియాంకగాంధీ, పక్కన పొన్నం ప్రభాకర్, సభకు హాజరైన ప్రజలు

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

పథకాలపై నాది 'గ్యారంటీ'

- కేసీఆర్ పాలనలో నిరుద్యోగులు రోడ్డుపాలు
- 'గౌరవెల్లి' పూర్తి చేయడంలో సర్కార్ నిర్లక్ష్యం
- పొన్నం గెలిస్తే హుస్నాబాద్‌కు మెడికల్ కళాశాల
- కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ

వర్షం కురుస్తున్నా మీ కోసం వచ్చా..

వాతావరణం అనుకూలించకపోయినా, అధికారులు వారించినా మిమ్మల్ని చూసేందుకు వచ్చానని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ అనడంతో ప్రజలు ఒక్కసారిగా చప్పట్లు హర్షధ్వానాలు చేశారు. మధ్యాహ్నం 12.30కు సభకు రావల్సి ఉండగా, 4.30 గంటలకు హెలికాప్టర్‌లో హుస్నాబాద్‌కు చేరుకున్నారు. అయినా ప్రజలు అలాగే వేచి చూడటం గమనార్హం. ప్రియాంక తన ప్రసంగంతో కాంగ్రెస్ నేతల్లో జోష్ నింపారు.

హుస్నాబాద్: ప్రజల సంక్షేమం కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమని పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు సంతోషంగా లేరని, బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మార్చాలని ఆమె పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల అమలు 'గ్యారంటీ' అని అన్నారు. హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌ను గెలిపించాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ విజయ భేరి సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రియాంకా గాంధీ పాల్గొని ప్రసంగించారు. ఈ ప్రాంత చిరకాల స్వప్నమైన గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. అలాగే గండిపెల్లి, తోటపల్లి ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. రైతుల నుంచి బలవంతంగా భూములను లాక్కుని పరిహారం ఇవ్వలేదన్నారు. విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో నిరుద్యోగులు రోడ్డు పాలయ్యారన్నారు. సీఎం కేసీఆర్ దత్తత తీసుకున్న చిన్న ముల్కనూర్ గ్రామం సైతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వకుండా భూములను గుంజుకొని దాడులు చేస్తుంటే ఇక్కడి ఎమ్మెల్యే ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. ప్రజలను కలవలేని ఈ ఎమ్మెల్యే అవసరమా అని ప్రశ్నించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందన్నారు. ఏ ప్రభుత్వ ఆఫీస్‌కు వెళ్లినా అవినీతిమయమైందని, ప్రాజెక్టులల్లో పెద్ద స్థాయిలో అవినీతి జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసితీరుతామన్నారు. ఇందిరమ్మ హయాంలో ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించగా ఇప్పటికీ ఆమెను గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. అలాగే తెలంగాణ ప్రజల ఆకాంక్షాలను గుర్తించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీని తల్లిలా గౌరవిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే హుస్నాబాద్‌లో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామని ప్రియాంక గాంధీ హామీ ఇచ్చారు.

కేసీఆర్ ఉద్యోగం పోతేనే..

తెలంగాణలో ఖాళీగా ఉన్న 2.50లక్షల ఉద్యోగాలు రావాలంటే కేసీఆర్ ఉద్యోగం పోవాలని కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. మరో నాలుగు రోజుల్లో బీఆర్‌ఎస్ కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేసే అవకాశం ఉందన్నారు. రైతుకు ఋణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. పక్కనున్న ఎమ్మెల్యే ఇక్కడకు అభివృద్ధి చేస్తామని చెప్పడం సతీష్‌కుమార్ అసమర్థతకు నిదర్శనమన్నారు. 40 ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ హుస్నాబాద్‌కు వస్తే మళ్లీ ఇప్పుడు అభినవ ఇందిరాగాంధీ వచ్చారని గుర్తు చేశారు.

ప్రజలను కలవని సీఎం

పదేళ్ల కాలంలో ప్రజలను కలవని సీఎం ఎవరైనా ఉన్నారనంటే అది కేసీఆరే అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. లక్షల కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే మూడేళ్లల్లోనే కుంగిపోయిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే , మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, ఏఐసీసీ కార్యదర్శి క్రిష్టోఫర్ తిలక్, నియోజకవర్గ పరిశీలకుడు గోపినాథ్, నాయకులు పాల్గొన్నారు.

వస్తారా.. రారా..?

- కండువా మార్చిన నాయకులతో వెళ్లని కేడర్
- కార్యకర్తల వైఖరితో నేతల ఇబ్బందులు
- తలలు పట్టుకుంటున్న నాయకులు



మెదక్: టికెట్లు ఆశించి భంగపడిన నేతలు కొందరు, పార్టీలో తమకు ప్రాధాన్యం దక్కడం లేదని మరికొందరు, ఇలా చాలా మంది వివిధ పార్టీల కండువాలు మార్చారు. అయితే, వారికి సంబంధించిన కేడర్ మాత్రం తమతోపాటు రాకపోవడంతో నేతలు తలలు పట్టుకుంటున్నారు. తమ వెంట వస్తే పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీలు సైతం ఇస్తున్నారు. అది కూడా కుదరకపోతే బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల్లో కండువాలు మార్చిన నేతలు చాలా మందే ఉన్నారు. వీరితోపాటు వెళ్లడానికి కార్యకర్తలు మాత్రం వెనుకడుగు వేశారు. దీంతో ''నిన్న, మొన్నటి వరకు నా వెంట ఉండి, పార్టీ మారాక నాతో రావా, నీ సంగతి చూస్తా''అంటూ పార్టీ మారిన నాయకులు ధమ్కీ ఇస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇటీవల నర్సాపూర్‌లో ఓ పార్టీ నేత ఎమ్మెల్యే టికెట్ ఆశించగా అతడికి టికెట్ లభించలేదు. వెంటనే మరో పార్టీలోకి జంప్ అయ్యాడు. కానీ, ఆ నాయకుడి వెంట కేడర్ మాత్రం వెళ్లలేదు. పార్టీ సిద్ధాంతం నచ్చి వారు ఆ పార్టీతోనే కొనసాగుతున్నారు. దీంతో ఆ నాయకుడు ''నా వెంట మీరు రావాల్సిందే''అని పలు వురు కార్యకర్తలను బెదిరించగా వారు వాగ్వాదానికి దిగారు.

మర్యాద కరువు

పార్టీలు మారిన నేతల వెంట కేడర్ వెళ్లకపోవడంతో కొత్తపార్టీలో ఆ నేతకు మర్యాద కరువైందని, ఎవరూ తమకు విలువ ఇవ్వడంలేదని జంప్‌జిలానీలు తలలు పట్టుకుంటున్నారు. నిన్న, మొన్నటి వరకు ప్రత్యర్థులుగా తిట్టుకున్న నేతలు ఒకేపార్టీలో చేరడంతో బలాలు, బలగాల లెక్కలపై పంచాయితీలు పెట్టుకుంటూ, జంప్ జిలానీలను సీనియర్ నాయకులు సూటిపోటీ మాటలతో అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీలు మారిన నేతలు కొత్త పార్టీలో ఇమడలేక నామూషీగా ఫీలవుతున్నట్లు సమాచారం.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పరిశీలన



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులకు మెదక్ కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. శుక్రవారం రెండో రోజు కార్యక్రమాన్ని ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా సందర్శించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్‌లతోపాటు ఇతర జిల్లా అధికారులు ఉన్నారు.

ఓటేసిన అదనపు కలెక్టర్

సాధారణ ఎన్నికల్లో భాగంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఎన్నికల అధికారులకు, సిబ్బందికి మెదక్ కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఏర్పాటు చేశారు. ప్రతీ ఓటరు తప్పనిసరిగా తన ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని గడపగడపకూ తీసుకెళ్లండి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

- గజ్వేల్‌లో వచ్చిన మార్పును వివరించండి
- కేసీఆర్ భారీ మెజారిటీకి బాటలు వేయండి
- బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకు మంత్రి హరీశ్‌రావు పిలుపు

గజ్వేల్: అభివృద్ధి, సంక్షేమాన్ని గడపగడపకూ తీసుకెళ్లి సీఎం కేసీఆర్‌కు భారీ మెజారిటీ వచ్చేలా పనిచేయాలని మంత్రి హరీశ్‌రావు బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా అధికార ప్రతినిధి పండరి రవీందర్ రావు నేతృత్వంలో గులాబీ గూటికి చేరారు. వీరికి మంత్రి హరీశ్‌రావు హైదబాద్‌లోని తన నివాసంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ ప్రాతినిధ్యం కారణంగా గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిలో యాభైఏళ్ల ముందుకు వెళ్లిందని చెప్పారు. ఇక్కడ నిర్మించిన కొండపోచమ్మసాగర్, ఫారెస్ట్రీ కళాశాల, హార్టికల్చర్ యూనివర్సిటీ, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో నిర్మించిన రింగురోడ్డు, ఏరియా, మాతాశిశుసంరక్షణ ఆస్పత్రి, ఎడ్యుకేషన్ హబ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తదితర అభివృద్ధి పనులు రాష్ట్రానికే తలమానికంగా నిలిచాయన్నారు. గతంతో పోలిస్తే గజ్వేల్‌లో ప్రస్తుతం వచ్చిన మార్పును ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరిఢవిల్లుతోందని చెప్పారు. ప్రభుత్వ పథకాలతో గ్రామీణ సమాజంలో గొప్ప పరివర్తన వచ్చిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మోసపూరిత విధానాలతో ప్రజల్లోకి వస్తున్నాయని, వారి దుష్ప్రచారాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షులు బెండె మధు, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు అరిగె అశోక్‌కుమార్, నాయకులు కొడిత్యాల భాస్కర్, పండరి వేణుమనోహర్‌రావు పాల్గొన్నారు.

అగ్రనేతలొస్తున్నారు..!

- రేపు తూప్రాన్‌కు మోదీ రాక
- బహిరంగసభలో పాల్గొననున్న ప్రధాని
- అందోల్ బహిరంగసభకు రాహుల్
- సంగారెడ్డి రోడ్‌షోలో పాల్గొననున్న ఏఐసీసీ అగ్రనేత
- జిల్లాలో కొనసాగుతున్న కేసీఆర్ బహిరంగ సభలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జాతీయ పార్టీల అగ్రనేతలు జిల్లాకు వరుస కట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వాతారు నియోజకవర్గాలకు వస్తున్నారు. ఈనెల 26న తూప్రాన్‌కు ప్రధాని నరేంద్రమోదీ రానున్నారు. ఈ మేరకు తూప్రాన్ పట్టణ సమీపంలోని బ్రాహ్మణపల్లి రైల్వేగేట్ సమీపంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. ఈ సభకు ఏడు నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తలు, ప్రజలు హాజరుకానున్నట్లు కమలం పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గజ్వేల్‌తో పాటు, సంగారెడ్డి, నర్సాపూర్, మెదక్, పటాన్‌చెరు, దుబ్బాక నియోజకవర్గాలకు చెందిన పార్టీ శ్రేణులు ఈ సభకు హాజరుకానున్నారు. మేడ్చల్ జిల్లాకు చెందిన బీజేపీ నేతలు కూడా ఈ సభకు తరలివస్తారని నాయకులు చెబుతున్నారు. తెలంగాణలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇందులో భాగంగా ఈ సభను నిర్వహిస్తున్నారు. ఈ బహిరంగ సభ స్థలాన్ని ఇప్పటికే ఎస్పీజీ బలగాలు ఆధీనంలోకి తీసుకున్నాయి. గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం పటాన్‌చెరు పట్టణానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వస్తున్నట్లు స్థానిక నాయకులు చెబుతున్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు గ్రౌండ్‌లో జరగనున్న విజయసంకల్ప యాత్ర సభలో ఆయన పాల్గొననున్నారు. అయితే అమిత్‌షా పర్యటన శుక్రవారం సాయంత్రం వరకు అధికారికంగా ఖరారు కాలేదు.

అందోల్ బహిరంగసభకు రాహుల్

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా ఈనెల 26న అందోల్‌కు రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జోగిపేట పట్టణంలో బహిరంగసభ నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. రాహుల్ ఈ బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం సంగారెడ్డి పట్టణంలో జరుగనున్న రోడ్‌షోలో పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రోడ్‌షో అనంతరం రాహుల్ కామారెడ్డి జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. జోగిపేటలోని బహిరంగ సభ ఏర్పాట్లను ఆ పార్టీ అందోల్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ శుక్రవారం పరిశీలించారు.

సీఎం కేసీఆర్ బహిరంగ సభలు

సంగారెడ్డి, అందోల్ నియోజకవర్గాల్లో రెండు రోజుల్లో సభలను నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది.

పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో..

ఈనెల 30వ తేదీన పోలింగ్ జరగనుండగా 48 గంటల ముందు ప్రచా రాన్ని నిలిపివేయాల్సి ఉంటుంది. ప్రచారానికి మూడు రోజులే సమయం ఉండటంతో ప్రధాన పార్టీలు ప్రచార వేగం పెంచాయి. ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తూనే అగ్రనేతలతో బహిరంగసభలు, రోడ్ షోలు నిర్వహించడం ద్వారా వీలైనంత ఎక్కువ లబ్ధిపొందాలని అభ్యర్థులు భావిస్తున్నారు.

రెండు పార్టీల జాతీయ అధ్యక్షులు

కాంగ్రెస్, బీజేపీల జాతీయ అధ్యక్షులిద్దరు ఇప్పటికే జిల్లాకు వచ్చారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వారం క్రితమే సంగారెడ్డి గంజ్‌మైదాన్‌లో జరిగిన బహిరంగసభకు హాజరైన విషయం విధితమే. రెండు రోజుల క్రితం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా కూడా ఇదేచోట జరిగిన బీజేపీ బహిరంగ సభలో పాల్గొన్నారు. మరోవైపు శుక్రవారం కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియంకా గాంధీ హుస్నాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ బహిరంగసభకు హాజరయ్యారు.



ర్యాలీ తీస్తున్న అధికారులు, విద్యార్థులు, అధ్యాపకులు

వాక్ ఫర్ ఓట్

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట గ్రామంలో శుక్రవారం స్వీప్ ఆధ్వర్యంలో వాక్ ఫర్ ఓట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి బ్రహ్మాజీ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. కళాజాత బృందంతో పాటల ద్వారా విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించామన్నారు. అలాగే వై షుడ్ ఐ ఓట్ అనే అంశంపై డిబేట్ నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ అధికారి హేమభార్గవి, అధ్యాపక బృందం రుక్మిణీదేవి, హేమంత్ కుమార్, మహేందర్ రెడ్డి, ప్రభాకర్, రాములు, దశమ్మ, హరిత, నవనీత, స్రవంతి, బోధనేతర సిబ్బంది వేణు, కిష్టయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మృత్యుంజయ హోమం



పూజలు నిర్వహిస్తున్న సత్యనారాయణ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి దొంతి వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం మృత్యుంజయ హోమం నిర్వహించారు. కొంతకాలంగా గ్రామ యువకులు చనిపోతుండటంతో ఇలాంటి సంఘటనలు జరగకూడ దని కోరుకుంటూ బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు, మృత్యుంజయ హోమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చిట్టా విప్పాల్సిందే..

కేసుల వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు

- సుప్రీంకోర్టు ఆదేశాలతో దినపత్రికల్లో ప్రకటనలు
- మెదక్‌లో ఇద్దరు, నర్సాపూర్‌లో ఒక్కరు వెల్లడి
- చెప్పకపోతే న్యాయపరమైన చిక్కులు



మెదక్: ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు తమపై ఉన్న కేసుల చిట్టాను బయట పెట్టాల్సిందే.. ఎవరిపై ఎలాంటి కేసులు ఉన్నాయి? ఎన్ని కేసులు ఉన్నాయి? అనే విషయాలు ప్రజలకు తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్న విషయం తెలిసిందే. దాని కోసం అభ్యర్థులు కూడా సిద్ధమయ్యారు. నామినేషన్లు వేసిన సమయంలో తమ కేసుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు వాటిని ప్రముఖ దినపత్రికల్లో ప్రకటిస్తున్నారు.

పారదర్శకంగా వ్యవహరించాలి

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు పారదర్శకంగా వ్యవహరించాలని, ఎలాంటి నేరచరిత్ర ఉన్నా బయట పెట్టాలన్న సుప్రీంకోర్టు నిబంధనల మేరకు అభ్యర్థులు తమపై ఉన్న కేసులను బయట పెడుతున్నారు. జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. మెదక్ నియోజకవర్గం బరిలో 13 మంది అభ్యర్థులు ఉండగా, నర్సాపూర్ బరిలో 11 మంది అభ్యర్థులు ఉన్నారు. అభ్యర్థులు తమపై ఉన్న కేసుల వివరాలను పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించాలి. రాజకీయంగా పారదర్శకత పాటించే ఏ నాయకుడికీ ఈ ప్రకటనలు ఇచ్చేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవు. రాజకీయ నాయకుడు అన్నాక కేసులు ఉండడం సర్వసాధారణమే. ప్రజా సమస్యల పోరాటంలో భాగంగా.. ఏదో ఒక సమయంలో ధర్నాలు, రాస్తారోకోలు చేసే సమయంలో కేసులు నమోదవుతుంటాయి. తెలంగాణ ఉద్యమంలో దాదాపు అన్ని పార్టీల నాయకులపైనా కేసులు నమోదయ్యాయి. అందులో చాలా వరకు కొట్టివేయగా.. ఇంకొన్ని విచారణ దశలో ఉన్నాయి. రాజకీయ జీవితం మొదలు కాకముందు, రాజకీయాల్లోకి వచ్చాక వ్యక్తిగత కారణాలతో నమోదైన క్రిమినల్ కేసులు కొందరిని ఇబ్బంది పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో ముగ్గురు అందజేత..

మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో మొత్తం 24 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉండగా ఇప్పటి వరకు ముగ్గురు అభ్యర్థులు పత్రికా ప్రకటనల ద్వారా కేసుల వివరాలు వెల్లడించారు. తర్వాత ఆ పేపర్ కటింగ్‌లను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఒకవేళ సదరు అభ్యర్థులపై కేసులు ఉండి పత్రికల ద్వారా వెల్లడించకపోతే న్యాయపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ కేసుల్లో ప్రజాసమస్యలపై పోరాటాలు చేసిన వారికి ఇది కలిసొచ్చే అంశం కాగా, ఉద్దేశపూర్వక నేరచరిత్రులకు మాత్రం ఇబ్బంది కలిగే అంశమని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

జిల్లాస్థాయి సైక్లింగ్‌ పోటీలు



సైక్లింగ్‌ పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలో ఉమ్మడి మెదక్‌ జిల్లాస్థాయి సైక్లింగ్‌ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఇందులో సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్‌ జిల్లాల నుంచి సుమారు 140మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను జిల్లా సైక్లింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు పాల్గొన్ని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా టెన్నికాయిట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కాటం శ్రీనివాస్‌, సైక్లింగ్‌ జిల్లా అసోసియేషన్‌ ప్రధానకార్యదర్శి జంగపల్లి వెంకట నర్సయ్య, పాఠశాలల క్రీడా సమాఖ్య ఉపాధ్యక్షుడు లింగాల శైలజరెడ్డి పాల్గొన్నారు.

108 సిబ్బందికి నేషనల్‌ అవార్డు



అవార్డులు అందుకుంటున్న అశోక్‌, వెంకట్‌

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు 108 సిబ్బంది నేషనల్‌ అవార్డు సొంతం చేసుకున్నారు. ఏప్రిల్‌ 5న రంగనాయక సాగర్‌ రిజర్వాయర్‌లో పనులు చేస్తున్న దంపతులు 23 రోజుల తమ చిన్నారికి స్నానం చేపిస్తుండగా నీళ్లు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. సమాచారం తెలుసుకున్న 108 పైలట్‌ వెంకట్‌, ఈఎంటీ అశోక్‌లు అక్కడకు చేరుకుని చిన్నారికి సీపీఆర్‌ చేసి ప్రాణాలు రక్షించారు. వీరి సేవలకు గుర్తింపుగా జీవీకే సంస్థ చైర్మన్‌ జీవీకే కృష్ణారెడ్డి చేతుల మీదుగా శుక్రవారం హైదరాబాద్‌లో నేషనల్‌ అవార్డును అందజేశారు.

తానా సమావేశానికి గురుశిష్యులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): ఆమెరికాలోని తానా సంస్థ ఈ నెల 26న నిర్వహిస్తున్న అంతర్జాతీయ బాల సాహిత్య జూమ్‌ సమ్మేళనంలో పాల్గొనడానికి సిద్దిపేట జిల్లా జక్కాపూర్‌ ఉన్నత పాఠశాలకు చెందిన హిందీ ఉపాధ్యాయులు భైతి దుర్గయ్య, తొమ్మిదో తరగతి విద్యార్థిని కొంపల్లి విశిష్టలకు తానా ప్రతినిధి తోటకూర ప్రసాద్‌ నుంచి ఆహ్వానం అందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షౌకత్‌ అలీ శుక్రవారం తెలిపారు. ఈ జూమ్‌ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాలకు చెందిన బాల రచయితలు, వారికి కథా రచన నేర్పిన ఆరుగురు గురువులు పాల్గొననున్నట్లు తెలిపారు.



దుర్గయ్య



కొంపెల్లి విశిష్ట

ఎన్నికలంటే ప్రజల భవిష్యత్‌



మాట్లాడుతున్న వినోద్‌ కుమార్‌, రసమయి బాలకిషన్‌

బెజ్జంకి(సిద్దిపేట): ఎన్నికలంటే ఓట్ల పండుగ కాదని, ఐదేళ్ల ప్రజల భవిష్యత్‌ అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌ కుమార్‌ పేర్కొన్నారు. శుక్రవారం బెజ్జంకిలో మానకొండూర్‌ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ రోడ్‌షో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వినోద్‌ మాట్లాడారు. కాంగ్రెస్‌ పాలిత రాష్ట్రాల్లో ప్రజలు అవస్థలు పడుతున్నారని విమర్శించారు. హరీశ్‌ సహకారంతో అభివృద్ధి సాధ్యమైందన్నారు. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఏఎంసీ చైర్మన్‌ కచ్చు చంద్రకళ, మహిపాల్‌రెడ్డి, మంజుల పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ హామీ ఇచ్చారు



దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ ఏర్పాటు విషయం ఇప్పటికే సీఎం కేసీఆర్‌, మంత్రి హరీశ్‌రావుల దృష్టికి తీసుకెళ్లాం. వారు సానుకూలంగా ఉన్నారు. దీనికి సంబంధించిన ఫైల్‌ సీఎం, మంత్రిల వద్ద ఉంది. ఈ నెల 26న దుబ్బాకలో జరిగే సభలో నిర్ణయిస్తారు.

– బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ ఏర్పాటు చేయిస్తా



ఈ ఎన్నికల్లో తనను మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే తప్పకుండా ప్రజల చిరకాల స్వప్నం దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయిస్తా. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చి మోసం చేసింది.

– బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ముత్యంరెడ్డి కల



నా తండ్రి, మాజీ మంత్రి స్వర్గీయ చెరుకు ముత్యంరెడ్డి కల దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను తప్పకుండా సాధిస్తా. కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే ప్రజల చిరకాల స్వప్నం నెరవేర్చుతా. ప్రజలు నన్ను గెలిపిస్తే వారి రుణం తీర్చుకుంటాను.

– కాంగ్రెస్‌ అభ్యర్థి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

కల నెరవేరేనా?

- దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ చుట్టే రాజకీయాలు
- ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీలకు ప్రధాన అస్త్రం
- 26న కేసీఆర్‌ ప్రకటిస్తారంటున్న బీఆర్‌ఎస్‌
- గెలిపిస్తే కల నెరవేర్చుతామంటున్న కాంగ్రెస్‌, బీజేపీ

దుబ్బాకటౌన్‌ : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అస్త్రం దుబ్బాక రెవెన్యూ డివిజనే. 2020 ఉపఎన్నికల సమయంలోనే డివిజన్‌గా ఏర్పాటవుతుందని ఆశించినా ప్రజలకు నిరాశే ఎదురైంది. ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌ చేయాలంటూ అన్నివర్గాల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. రాష్ట్రం ఆవిర్భావం తర్వాత జిల్లాల పునర్విభజన సమయంలో సిద్దిపేట జిల్లాగా, దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా చేస్తారని ఈ ప్రాంతం వారు ఎదురుచూశారు. కానీ అలా జరగలేదు. పాత సమితి కేంద్రంగా, తాలుకాగా, నియోజకవర్గ కేంద్రంగా మున్సిపాలిటీగా ఉన్న దుబ్బాకకు రెవెన్యూ డివిజన్‌కు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయి. 2016లో రెవెన్యూ డివిజన్‌ చేయాలంటూ దుబ్బాక పట్టణంలో 45 రోజుల పాటు ఉద్యమం జరిగింది. అప్పటి నుంచి నిరంతరం ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ప్రజల ఆకాంక్ష దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ చుట్టే రాజకీయాలు తిరుగుతున్నాయి.


సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట జిల్లా కేంద్రంగా ఉండడంతో పాటు నియోజకవర్గ కేంద్రాలైన గజ్వేల్‌, హుస్నాబాద్‌లను రెవెన్యూ డివిజన్లుగా చేసి నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాకను డివిజన్‌ చేయకపోవడం శోచనీయం.

ఆరు మండలాలతో దుబ్బాక డివిజన్‌

దుబ్బాక నియోజక వర్గంలో ప్రస్తుతం 8 మండలాలు ఉండగా చేగుంట, నార్సింగ్‌ మండలాలు తూప్రాన్‌ డివిజన్‌లో ఉన్నాయి. దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్‌, రాయపోల్‌, భూంపల్లి–అక్బర్‌పేట మండలాలతో డివిజన్‌ చేస్తే ప్రజలకు అనుకూలంగా ఉంటుంది.

26న ప్రకటిస్తారని ప్రచారం

దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ డిమాండ్‌ను సీఎం కేసీఆర్‌, మంత్రి హరీశ్‌రావు దృష్టికి ఇప్పటికే ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తీసుకెళ్లాడని, ఈ నెల 26 న దుబ్బాకలో జరిగే బహిరంగ సభలో డివిజన్‌గా చేస్తున్నట్లు ప్రకటిస్తారని బీఆర్‌ఎస్‌ వర్గాలు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. హరీశ్‌ సైతం కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించండి దుబ్బాక డివిజన్‌ చేస్తామని రోడ్‌ షోల్లో హామీలు ఇస్తున్నారు.



రేవంత్‌ నోటా దుబ్బాక డివిజన్‌..

దుబ్బాకలో గురువారం జరిగిన బహిరంగ సభలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించండి దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తుంది దుబ్బాక డివిజన్‌ను చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

బీజేపీ సైతం దీనిపైనే ఫోకస్‌

దుబ్బాకలో మళ్లీ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపిస్తే తప్పకుండా రెవెన్యూ డివిజన్‌ ఏర్పాటు అవుతుందని ఆ పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే రఘునందన్‌రావు సైతం భూంపల్లి–అక్బర్‌పేట కొత్త మండలం ఏర్పాటు చేశానని, దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌ చేస్తానంటూ ప్రచారంలో ప్రజలకు వివరిస్తున్నారు.



మహిళలతో కలిసి రామక్క పాటపై నృత్యం చేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కాళేశ్వరంపై దుష్ప్రచారం సిగ్గుచేటు

- రూ.80వేల కోట్లు ఖర్చుపెడితే... లక్ష కోట్ల అవినీతి అంటారా?
- ఎఫ్‌డీసీ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌ : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై బీజేపీ నేతలు విషప్రచారం చేయడం సిగ్గుచేటని ఎఫ్‌డీసీ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం గజ్వేల్‌ ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలోని వేములగాట్‌, పల్లెపహాడ్‌, ఎర్రవల్లి గ్రామాల్లో కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.80వేల కోట్ల ఖర్చుతో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మిస్తే... లక్ష కోట్ల అవినీతి జరిగిందని బీజేపీ నేతలు ఆరోపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు నిర్వాసితుల సమస్యల గురించి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలో 90శాతం సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్‌ పరిష్కరించారని చెప్పారు. పెండింగ్‌ సమస్యలను ఎన్నికల తర్వాత పరిష్కరించడానికి హామీ ఇచ్చారని చెప్పారు. జూటా మాటలతో ఎన్నికల ప్రచారంలోకి వస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌లను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్న బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎల్లం, సంధ్య, బాలమణి, నాయకులు బాలకిషన్‌, నాగరాజు, మల్లేశం, నగేష్‌, నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములు పాల్గొన్నారు. కాగా 'గులాబీల జెండాలే రామక్క' పాటపై ప్రతాప్‌రెడ్డి మహిళలతో కలిసి నృత్యం చేసి ప్రచారంలో ఉత్సాహం నింపారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కేసీఆర్‌కు మద్దతు

గజ్వేల్‌ : గజ్వేల్‌లో పోటీ చేస్తున్న కేసీఆర్‌కు టాక్సీ డ్రైవర్స్‌ అసోసియేషన్‌ మద్దతు ప్రకటించింది. శుక్రవారం పట్టణంలోని వైష్ణవీ గార్డెన్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. అదేవిధంగా ప్రైవేటు బస్సు డ్రైవర్ల అసోసియేషన్‌ నాయకులు సైతం మద్దతు తెలిపారు.

కాంగ్రెస్‌, బీజేపీలను ప్రజలు నమ్మరు



కొత్తగూడెం గ్రామంలో ప్రచారంలో మాట్లాడుతున్న సునీత లక్ష్మారెడ్డి

బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర (సంగారెడ్డి): కేసీఆర్‌ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని నర్సాపూర్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం హత్నూర మండలం షేర్ఖాన్‌ పల్లి, రేండ్లగూడ, కొత్తగూడెం, కుడిపాక, నాగారం, వడ్డేపల్లి, చింతల్‌ చెరువు, కోనంపేట తదితర గ్రామాలలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు చెప్పే మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అలాగే సునీత లక్ష్మారెడ్డికి మద్దతుగా రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్‌ దేవేందర్‌ రెడ్డి మంగాపూర్‌ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. మెదక్‌ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ చంద్రగౌడ్‌, ఎంపీపీ నర్సింలు, జెడ్పీటీసీ ఆంజనేయులు, పీఏసీఎస్‌ చైర్మన్లు దుర్గారెడ్డి, దామోదర్‌ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌ రావు, రాజేందర్‌, గోవర్ధన్‌ రావు, రమేష్‌ నాయక్‌ పాల్గొన్నారు.

శివ్వంపేట (నర్సాపూర్‌): శివ్వంపేటతోపాటు అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్‌ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సునీతారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

నర్సాపూర్‌ : పట్టణంలో సునీతారెడ్డికి మద్దతుగా బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్లు, నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ నయీముద్దీన్‌, అశోక్‌గౌడ్‌, లలిత, సునీత, రాంచందర్‌, గోవర్ధన్‌రెడ్డి, భిక్షపతి, బాల్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌, హబీబ్‌ఖాన్‌, నగేష్‌, శ్రీశైలంయాదవ్‌ పాల్గొన్నారు.

అత్త కోసం కోడలి ప్రచారం

కౌడిపల్లి(నర్సాపూర్‌): అత్తను గెలిపించాలని కోడలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం కౌడిపల్లి మండలం ముట్రాజ్‌పల్లి, రాజిపేట, వెంకటాపూర్‌(ఆర్‌) గ్రామాలలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సునీతారెడ్డిని గెలిపించాలని ఆమె కోడలు రిత్వికారెడ్డి ప్రచారం చేశారు.

కొల్చారం(నర్సాపూర్‌): మండలంలోని ఆయా గ్రామాల్లో సునీతారెడ్డికి మద్దతుగా గులాబీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను పంచిపెట్టారు.

వెల్దుర్తి(తూప్రాన్‌): నర్సాపూర్‌ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ గెలుపును ఎవరూ ఆపలేరని బీఆర్‌ఎస్‌ మాసాయిపేట మండల ఎన్నికల ఇన్‌చార్జి, ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డికి మద్దతుగా మండలంలోని కొప్పులపల్లి, బొమ్మారం, నాగ్సాన్‌పల్లి, స్టేషన్‌ మాసాయిపేట, హకింపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

నర్సాపూర్‌ : సునీతారెడ్డి సమక్షంలో కాగజ్‌మద్దూర్‌ గ్రామ బీఆర్‌ఎస్‌ నాయకుడు అశోక్‌గౌడ్‌ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కుమార్‌, సాయి, గోపాల్‌నాయక్‌, రాజు నాయక్‌లతో పాటు పలువురు గులాబీ పార్టీలో చేరారు.

మాది రైతు ప్రభుత్వం

బీఆర్‌ఎస్‌ అందోల్‌ అభ్యర్థి క్రాంతి కిరణ్‌



దాదాయిపల్లిలో ప్రచారం చేస్తున్న క్రాంతి కిరణ్‌

టేక్మాల్‌(మెదక్‌): రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమేనని పార్టీ అందోల్‌ అభ్యర్థి క్రాంతి కిరణ్‌ అన్నారు. శుక్రవారం మండలంలోని బోడ్మట్‌పల్లి, బర్దిపూర్‌, దాదాయి పల్లి, మల్కాపూర్‌, దనూర, పల్వంచ, ఎల్లకుర్తి, శేరిపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతురుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాలతో రైతు సంక్షేమానికి కేసీఆర్‌ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములకు పట్టాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్‌ చైర్మన్‌ బాలయ్య, పార్టీ మండలాధ్యక్షుడు వీరప్ప, పీఏసీఎస్‌ చైర్మన్‌ యశ్వంత్‌రెడ్డి, నాయకులు ముక్తార్‌, సలీమ్‌, భాస్కర్‌, విక్రంగౌడ్‌, విక్రందేష్‌పాండే, అవినాష్‌, శ్రీధర్‌రెడ్డి, సిద్దయ్య, ఈశ్వరప్ప, అంజయ్య, రవిశంకర్‌, విఠల్‌, శ్రీనివాస్‌, రామకృష్ణారెడ్డి, శ్రీశైలం, మల్లేశం, పాండ్యా నాయక్‌, దుర్గయ్య, చాంద్‌పాషా, నర్సింలు, మహేందర్‌ ఉన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేసి గోసపడొద్దు

- బీఆర్‌ఎస్‌ పాలనే ప్రజలకు శ్రీరామరక్ష
- సంక్షేమ పథకాలకు పట్టం కట్టండి
- బీఆర్‌ఎస్‌ అభ్యర్థి చింతా ప్రభాకర్‌



మాట్లాడుతున్న చింతా ప్రభాకర్‌

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): కాంగ్రెస్‌ హామీలను నమ్మి గోసపడొద్దని, సీఎం కేసీఆర్‌ పాలనే ప్రజలకు శ్రీరామరక్ష అని బీఆర్‌ఎస్‌ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ అన్నారు. మండల పరిధిలోని నిజాంపూర్‌, కోల్కూర్‌, పొట్టిపల్లి, యెట్టిగడ్డసంఘం, మలపాడ్‌ తదితర గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే ఓట్లడిగి ప్రజలను మోసం చేసే పార్టీలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పగటి వేషగాళ్లలాంటి ఓట్ల వేటగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సంక్షేమం, ప్రగతికి పట్టం కట్టే బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి సంక్షేమ పథకాలే తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న మహిళలు

భూపాల్‌రెడ్డిని గెలిపించండి



పెద్దశంకరంపేటలో బీఆర్‌ఎస్‌ నాయకుల ప్రచారం

పెద్దశంకరంపేట(మెదక్‌): ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న బీఆర్‌ఎస్‌ పార్టీని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్‌, ఎంపీటీసీ విగ్రాం వీణసుభాష్‌గౌడ్‌ ఓటర్లను కోరారు. శుక్రవారం పేటలోని ఆయా కాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణఖేడ్‌ ఎమ్మెల్యేగా భూపాల్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. నాయకులు పున్నయ్య, ఎండీ సలీం, సతీశ్‌, సంగమేశ్వర్‌ ఉన్నారు.

దుబ్బాక నీలకంఠ రక్షణ సమితి ఏర్పాటు

దుబ్బాకటౌన్‌ : పట్టణంలో నీలకంఠ సమాజం అభివృద్ధి కోసం శుక్రవారం నూతనంగా రక్షణ సమితి ఏర్పాటైంది. సంఘంలో అవకతవకలు జరుగడంతో జరిగిన పొరపాటుకు నైతిక బాధ్యత వహిస్తూ ఇప్పటి వరకున్న పాలకవర్గం రాజీనామా చేసింది. దీంతో నూతనంగా నీలకంఠ రక్షణ సమితిని ఏర్పాటు చేసి.. ఇందులో బోడ శ్రీహరి, తుమ్మ దుబ్బరాజం, అక్కల రాజేశ్వర్‌, వీరబత్తిని లింగం, అజ్జ బాల్‌రాజులను సలహాదారులుగా ఎన్నుకున్నారు. అలాగే సహాయ సలహాదారులుగా వీరబత్తిని రాజు, కాల్వ రామస్వామి, ఆలేటి చంద్రమౌళి, గవ్వల చంద్రమౌళి, లొంక శ్రీనివాస్‌, కాల్వ రాజు, కడవేర్గు శ్రీనివాస్‌, వీరబత్తిని శ్రీకాంత్‌, కాల్వ సత్యనారాయణ, గవ్వల జనార్ధన్‌, కడవేర్గు నరేష్‌, అజ్జ రాజ్‌ కుమార్‌, బోడ జనార్ధన్‌, తుమ్మ భానుచందర్‌, వీరబత్తిని విఠల్‌ను ఎన్నుకున్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి పోటీలు

వర్గల్‌(గజ్వేల్‌): జ్యోతిబా పూలే బీసీ గురుకులాల రాష్ట్రస్థాయి బాలికల ఆటల పోటీలు హోరాహోరీగా జరిగాయి. శుక్రవారం మూడోరోజు సైతం ఆతిథ్య మెదక్‌జిల్లా క్రీడాకారిణులు ఆధిక్యత ప్రదర్శించారు.

వివిధ పోటీలలో.. : డిగ్రీ విభాగం వాలీబాల్‌ పోటీ సెమీఫైనల్స్‌లో మెదక్‌ జట్టు నిజామాబాద్‌ను ఓడించి ఫైనల్‌కు చేరింది. కబడ్డీ పోటీలో నిజామాబాద్‌ జట్టుపై మెదక్‌ జయకేతనం ఎగరేసి సెమీఫైనల్‌ పోరుకు సిద్ధమైంది. లాంగ్‌జంప్‌లో మెదక్‌ క్రీడాకారిణి సీ.ఇంద్రాణి, డిస్కస్‌త్రోలో ఆర్‌.సుజాత విజేతలుగా నిలిచారు. 400 మీటర్లు, 100 మీటర్ల రిలే రేసు, 3000 మీటర్లు, 1500 మీటర్ల పరుగులోనూ మెదక్‌ క్రీడాకారిణులు విజయాలు నమోదు చేసి ఆధిక్యత చాటారు. కబడ్డీ, వాలీబాల్‌, ఖోఖో అండర్‌–19, అండర్‌–17, అండర్‌–14 పోటీలకు సంబంధించి లీగ్‌దశ పోటీలు ముగింపు దశకు చేరాయి.

ఎన్నికల చిత్రాలు

తండ్రి కోసం తనయుడి ప్రచారం



చేర్యాల(సిద్దిపేట): జనగామ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుమారుడు పల్లా అనురాగ్‌రెడ్డి శుక్రవారం పట్టణ పరిధిలోని 5వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అదేవిధంగా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా బీఆర్‌ఎస్‌ రాష్ట్రనాయకుడు ఉల్లెంగుల సేవాట్రస్ట్‌ చైర్మన్‌ ఉల్లెంగుల ఏకానందం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీడీలు చుడుతున్న మహిళల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటేస్తే 2వేలు ఉన్న పెన్షన్‌ 5వేలు చేస్తారని తెలిపారు.

టీ తాగి రిలీఫ్‌ అవుదాం

నర్సాపూర్‌: నర్సాపూర్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి శుక్రవారం పట్టణ పరిధిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా పార్టీ నాయకులతో కలిసి ఓ హోటల్‌ వద్ద టీ తాగుతూ రిలాక్స్‌ అయ్యారు.



విద్యుదాఘాతంతో రైతు మృతి

దౌల్తాబాద్‌(దుబ్బాక): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నర్సంపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్‌ మండలం నర్సంపేట గ్రామానికి చెందిన పెరమాండ్ల రాములు(47)కు శేరిపల్లి గ్రామ శివారులో వ్యవసాయ పొలం ఉంది. గురువారం రాత్రి పశువులకు నీళ్లు పెట్టడానికి పొలం వద్దకు వెళ్లాడు. గట్టు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ వైర్లు అతనికి తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం మృతుని భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



రాములు(ఫైల్‌)

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కొండపాక(గజ్వేల్‌): లారీ రోడ్డు పక్కన నిలిపి బహిర్భూమి కోసం వెళ్తున్న డ్రైవర్‌ను వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టడంతో గాయపడ్డాడు. ఈ సంఘటన కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో రాజీవ్‌ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. షోలాపూర్‌ చెందిన లారీ డ్రైవరు మహ్మద్‌ యూసుఫ్‌ హైదరాబాద్‌ నుంచి కరీంనగర్‌కు లారీని తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో బహిర్భూమికి వెళ్లేందుకు లారీని పక్కన ఆపి వెళ్తుండగా మరో లారీ ఢీకొట్టింది. దీంతో యూసుఫ్‌కు కాలు విరగడంతో పాటు గాయాలయ్యాయి. 108 సిబ్బంది బాధితుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.